## క్లుప్తంగా

### మర్యాదపూర్వక కలయిక



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు మర్యాదపూర్వకంగా కలిశారు.

### పద్మనాభ స్వామి తిరు కల్యాణానికి ఆహ్వానం



శ్రీత్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి చెంత రూపాకుల రవికుమార్

**మహారాణిపేట :** మార్చి 3న జరిగే అనంత పద్మనాభ స్వామి వార్షిక తిరు కల్యాణంలో పాల్గొనాలని రూపాకుల విశాలక్షి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఆర్.రవికుమార్ శ్రీత్రిదండి దేవ నాథ రామానుజ జీయర్ స్వామికి ఆహ్వానం పలికారు. గురువారం రవికుమార్ స్వామివారిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. లోక కల్యాణార్థం జరిగే స్వామి తిరు కల్యాణంలో పాల్గొనాలని, స్వామి ఆశీస్సులు సమస్త ప్రజలకు అందాలని రవికుమార్ కోరారు. కల్యాణోత్సవంలో పాల్గొంటానని స్వామి హామీ ఇచ్చినట్టు రవికుమార్ తెలిపారు. పడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### కనకరాజు మృతి కళాకారులకు తీరని లోటు



కనకరాజు (ఫైల్)

**సీతమ్మధార :** అక్కినేని నాటకోత్సవాల కమిటీ వ్యవస్థాపక కార్యదర్శి వి.కనకరాజు మృతి కళాకారులకు తీరని లోటు అని బాదంగీర్ సాయి అన్నారు. సురభి సంస్థను తనకు పరిచయం చేసిన కనకరాజు మృతి బాధాకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

### సంఘ సేవకుడికి నివాళి



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న జహీర్ అహ్మద్ తదితరులు

**దాబాగార్డెన్స్:** ప్రముఖ సంఘ సేవకుడు, వివేకానంద సంస్థ గౌరవ సభ్యుడు ఎంఎస్ హక్ ఇటీవల మృతి చెందారు. సంస్థ ఆధ్వర్యంలో గురువారం నివాళి కార్యక్రమం నిర్వహించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, అధ్యక్షుడు సూరాడ అప్పారావు, రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుడు మక్సుద్ అహ్మద్ పాల్గొని హక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హక్ కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జహీర్ అహ్మద్ మాట్లాడుతూ వివేకానంద సంస్థకు అనేక సేవలందించారని తెలిపారు. అటువంటి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గజపతిరావు, సత్తిబాబు, ఈశ్వరరావు, భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.



# భక్తుడు కట్టిన గుడి

- అచ్చియ్యమ్మపేటలో దుర్గాలమ్మ ఆలయం
- నిర్మించిన బంగారు శెట్టి.. పూజారీ ఆయనే..



భక్తులకు కొంగుబంగారమై నిలిచిన అచ్చియ్యమ్మపేట చిన దుర్గాలమ్మ అమ్మవారు



చిన దుర్గాలమ్మ అమ్మవారి ఆలయం

**జగదాంబ :** అచంచల విశ్వాసం ఉంటే ఏదైనా సాధించవచ్చని పెద్దలు చెబుతారు. అక్షరాలా దాన్ని నిజం చేసి చూపించారు పాలమరశెట్టి బంగారుశెట్టి. ఆధ్యాత్మిక బాటలో పయనించాలని.. సొంతంగా ఓ ఆలయం నిర్మించాలని కన్న కలను నెరవేర్చుకున్నారు. అలాగని ఎవరి సాయమూ కోరలేదు. ఎక్కడా చేయి చాచి అడిగింది లేదు. రెక్కల కష్టంతోనే ఆలయాన్ని మనస్ఫూర్తిగా ఆవిష్కరింపజేశారు. అదే అచ్చియ్యమ్మపేటలోని చిన దుర్గాలమ్మ ఆలయం. ఎంతో శక్తి గల తల్లిగా భక్తులతో నిత్య పూజలందుకుంటున్న దుర్గాలమ్మ ఆలయానికి పూజారి కూడా ఆయనే..

పూర్ణామార్కెట్‌లోని అచ్చియ్యమ్మపేటలో చిన దుర్గాలమ్మ ఆలయం నిర్మించి.. నిత్యపూజలు చేస్తున్న బంగారుశెట్టి కుటుంబం చిన్నతనంలోనే బర్మా నుంచి ఇక్కడకు వలస వచ్చింది. అప్పుడు ఆయనకు పదేళ్లు. 'బర్మాలో పెద్ద ఎత్తున దుర్గామాత సంబరాలు చేసేవారు. ఆ సంబరాలకు భారీ పోలీసు బందోబస్తు ఉండేది. దుర్గమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న నాకు ఆ తల్లిపై అచంచలమైన భక్తి విశ్వాసాలు కలిగాయి. ఎందుకో తెలియదు గానీ నేను కూడా ఆ తల్లికి ఎప్పటికైనా అలా పూజలు నిర్వహించాలని గట్టిగా నిర్ణయించుకున్నాను.' అని బంగారుశెట్టి చెబుతారు. బంగారుశెట్టి పెద్దగా చదువుకోలేదు. పేద కుటుంబం. బతుకు బండి లాగే తండ్రికి సాయంగా చిన్నతనంలోనే మూటలు మోశారు. పెరిగి పెద్దాయ్యాక రిక్షా తొక్కారు. ఎలా ఉన్నా.. ఏం చేస్తున్నా.. దుర్గమ్మకు ఆలయం కట్టాలన్న సంకల్పం ఆయన మదిలో నిత్యం మెదిలేది.

**1992లో మొదలు..**

ఓ పక్క కాయకష్టం చేస్తూనే.. వచ్చిన దాంట్లో ఎంతో కొంత మిగుల్చుకునేవారు. ఆ సొమ్ముతో ఆలయం కట్టాలన్నది ఆయన లక్ష్యం. మొక్కవోని ధైర్యంతో 1992లో అచ్చియ్యమ్మపేటలో చిన దుర్గాలమ్మ ఆలయ నిర్మాణం చేపట్టారు. తాత్కాలికంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. ఆలయ నిర్వహణకు గానీ.. పూజలు, ఇతరత్రా వైదిక కార్యక్రమాలకు గానీ ఎవరినీ చేయి చాచి అడిగేవారు కాదు. స్వచ్ఛందంగా ఎవరైనా వచ్చి పూజల కోసం ఇస్తే తీసుకునేవారు. ఈ క్రమంలో ఊహించని సంఘటన ఆయనకు ఎదురైంది. పూర్ణామార్కెట్ ప్రాంతంలో రౌడీయిజం, ఉత్సవాల పేరిట చందాలు వసూలు చేయడం వంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారనే కారణంతో కొందరితో పాటు బంగారుశెట్టిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంటరాగేషన్‌లో బంగారుశెట్టి తన గురించి పోలీసులకు చెప్పాక.. పొరపాటున తీసుకొచ్చామని గ్రహించి ఆయన్ని విడుదల చేశారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా దుర్గా పూజలు నిర్వహించుకోవచ్చని అప్పటి పోలీస్ కమిషనర్ డీటీ నాయక్ ఆయనకు భరోసా ఇచ్చారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ ఫరీదాతో మాట్లాడి దుర్గాలమ్మ ఆలయ నిర్మాణానికి తోచిన సాయం చేయాలని కోరారు. దీంతో తాత్కాలిక ఆలయ స్థానంలో మరిన్ని సౌకర్యాలతో కొత్త ఆలయ నిర్మాణం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఈ ఆలయంలో నిత్యం పూజలు జరుగుతున్నాయి. ఆలయంలో ఏటా దసరా, కార్తీకమాసం, శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఇందులో భాగంగా ఈ నెల 18న అగ్నిగుండం, 19న అమ్మవారి జాతర పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు బంగారుశెట్టి తెలిపారు.

### జన్మ ధన్యమైంది



ఎక్కడి బర్మా.. ఎక్కడి ఇండియా.. నేను కన్న కల నిజమైంది. అమ్మవారికి సొంతంగా ఆలయం నిర్మించినందుకు ఈ జన్మ ధన్యమైంది. చిన దుర్గాలమ్మను నిత్యం భక్తులు దర్శించుకుంటున్నారు. భక్తులు, దాతల సాయంతో అమ్మవారికి నిర్విరామంగా సేవలందుతున్నాయి.

– బంగారుశెట్టి,
ఆలయ నిర్మాణకర్త, పూజారి

### అమ్మ చూపు చల్లన



అమ్మ సత్యమైన తల్లి. ఇక్కడ 40 ఏళ్ల నుంచి బతుకుతున్నాం. మొదట్లో మా అత్తమామాలు ఉండేవారు. వారి తర్వాత నేను ఇక్కడ దుకాణం పెట్టుకున్నాను. ఏ రోజు రూపాయి నష్టం రాలేదు. ఎంతో మంది అమ్మ నీడలో ఏ లోటు లేకుండా బతుకుతున్నాం. ఇదంతా అమ్మ చల్లని చూపు వల్లే..

– అప్పల నరసమ్మ,
కొబ్బరికాయల వ్యాపారి

### తల్లి కాచి కాపాడుతుంది



చిన దుర్గాలమ్మ ఎంతో గొప్ప తల్లి. భక్తితో కొలిచిన వారిని కాపాడుతుంది. చాలా ఏళ్ల కిందట పూర్ణమార్కెట్‌లో జరిగిన గొడవల సమయంలో నన్ను కూడా పోలీసులు తీసుకుపోయారు. అమ్మ దయ వల్లే నేను బయట పడ్డాను.

– సూరమ్మ,
అచ్చియ్యమ్మపేట, పూర్ణామార్కెట్

# సిరులతల్లికి సహస్ర తులసిపూజ



తులసి పూజలందుకున్న కనకమహాలక్ష్మి

**దాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్ శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

### 175 స్థానాలు మహిళలకే

**దాబాగార్డెన్స్:** రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాలు మహిళలకే కేటాయిస్తున్నట్టు అమ్మ పార్టీ జిల్లా కన్వీనర్ కృష్ణవేణి తెలిపారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సాధికారతే లక్ష్యంగా.. అమ్మ పాలనే ధ్యేయంగా పార్టీ ఆవిర్భవించిందన్నారు. అభివృద్ధి బాటలో పయనింప జేసేందుకు అమ్మ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. సమావేశంలో బీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# శివ పూజకు సన్నద్ధం

- ముస్తాబవుతున్న ఆలయాలు
- దక్షిణానికి శివరాత్రి శోభ



సూర్యాబాగ్‌లో శతాబ్దాల చరిత్ర గల విశ్వేశ్వరాలయం



పాతనగరంలో గల భీమేశ్వరాలయం



బుచ్చిరామలింగేశ్వరాలయం (బెల్లం గణపతి ఆలయం)



వైశాఖేశ్వర ఆలయం

**దాబాగార్డెన్స్:** భక్తజన వల్లభుడు, భోళా శంకరుడిని ప్రీతిపాత్రంగా సేవించడానికి.. అర్చనలు, అభిషేకాలతో ప్రసన్నుడిని చేసుకోవడానికి, ఉపవాసాలు, జాగరణలతో పార్వతీపతి అనుగ్రహం పొందడానికి అనువైన మహాశివరాత్రి కోసం లోకం సర్వసన్నద్ధమైంది. శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు పంచాక్షరీ మంత్ర ప్రతిధ్వనులతో మార్మోగనున్నాయి. శనివారం వేకువ నుంచే మహాశివునికి అభిషేకాలు ప్రారంభం కానున్నాయి. ద్వాదశ జ్యోతిర్లింగాలకు విశేష పూజలు, వివిధ అభిషేకాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి లింగోద్భవ కాలం వరకు ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. పరమశివుడి దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని ప్రధాన శివాలయాల్లో పూజలకు భారీ ఏర్పాట్లు చేశారు. మెయిన్‌రోడ్డులో గల విశ్వేశ్వరాలయంలో వేకువ జాము నుంచే పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరపనున్నారు. సింగ్‌హోటల్ జంక్షన్ శివాలయం వీధిలో ఉన్న ఓంకార ఆలయంలో ప్రాత:కాలం నుంచే ఓంకారేశ్వర స్వామికి అభిషేకాలు జరపనున్నారు. రాత్రి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేయనున్నారు. ఏవీఎన్ కాలేజీలో ఉన్న శివాలయం, పోలీస్ బ్యారెక్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, అస్సాం గార్డెన్స్‌లో గల శివరామకృష్ణ ఆలయం, బీచ్‌రోడ్డులో గల కోటేశ్వరాలయం, పెరికివీధిలో గల శివాలయంలో ప్రత్యేక పూజలు జరపనున్నారు.

**ప్రాచీనం.. ప్రసిద్ధం..**

తరతరాల చరిత్రకు ఆలవాలమైన విశాఖపట్నం.. కాలగతిలో ఎన్నో మార్పులకు లోనైంది. సెలయేటి గమనాన్ని అందిపుచ్చుకుని.. ఒక్కో మలుపు వద్ద ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుని ఇప్పుడు కడలంత కీర్తిని సొంతం చేసుకుంది. ఆనవాళ్లు కూడా దొరకని కాలంలో మామూలు పల్లెగా ఉన్న ఈ ప్రాంతం.. క్రమేణా ఎదిగింది. ఎందరో రాజులు, చక్రవర్తులు, జమీందారుల పాలనలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయా కాలాల్లో ప్రభువులు దైవ చింతనలో ఏర్పాటు చేసిన ప్రాచీన ఆలయాలకు ఇప్పటికీ నెలవుగా ఉంది. పాతనగరంలో నాటి ప్రాచీన ఆలయాల వైభవం కళ్లెదుట కదలాడుతోంది.

**వైశాఖేశ్వర ఆలయం..**

14వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని కుళోత్తుంగ చోళుడు పరిపాలించాడు. ఆయన తమ ఇలవేల్పునకు బంగాళాఖాతంలో (కోస్టల్ బ్యాటరీ వద్ద) వైశాఖేశ్వర ఆలయాన్ని నిర్మించాడు. ఆ దైవం పేరిట విశాఖకు ఈ పేరు స్థిరపడిందని ఓ వాదన ఉంది. అయితే ఈ ఆలయం కాలక్రమంలో సముద్ర గర్భంలో కలిసిపోయింది. దాని నమూనాతో ప్రస్తుతం కలెక్టరేట్ సమీపంలోని ఆఫీషియల్ కాలనీ మూడో వీధిలో నిర్మించిన ఆలయం బుచ్చిరామలింగేశ్వర ఆలయంగా వ్యవహృతమవుతోంది. ఆగ్నేయ ముఖంగా ఉన్న ఈ ఆలయంలో స్వామి స్ఫటిక లింగంగా భక్తులకు దర్శనమిస్తున్నారు.

**400 ఏళ్ల నాటి శివాలయం..**

ఇప్పటి దసపల్లా హోటల్ పక్కనే ఉన్న విశ్వేశ్వర స్వామి ఆలయానికి నాలుగు శతాబ్దాల చరిత్ర ఉంది. గతంలో ఈ ప్రదేశంలో ఓ నాగసాధువు మఠం నిర్వహించేవారు. తన శిష్యురాలైన బాదంపూడి వంశీయులతో విశ్వేశ్వరస్వామి మూల విరాట్టును ప్రతిష్ఠంప జేశారు. శివలింగానికి చేసే అభిషేక జలం తన జీవ సమాధిపై పడేలా ఏర్పాట్లు చేసుకుని స్వామిజీ సజీవ సమాధిలోకి వెళ్లిపోయారు. అందుకే ఈ దేవాలయాన్ని మఠం కోవెలగా వ్యవహరిస్తున్నారు.

**భీముడు ప్రతిష్ఠించిన శివలింగం**

ప్రస్తుతం పాతనగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ చేరువలోని భీమేశ్వరాలయానికి కూడా ప్రాచీన చరిత్ర ఉంది. పాండవుల వనవాస సమయంలో భీముడు శివలింగాన్ని ప్రతిష్ఠించాడన్న ఖ్యాతిని పొందిన ఆలయం. నాలుగు దశాబ్దాల క్రితం పునరుద్ధరణ కారణంగా మరింత గుర్తింపు పొందింది. లోతుగా ఉన్న గర్భగుడిని 1981లో పైకి తీసుకువచ్చి ఆలయాన్ని పున:నిర్మించారు.

# శిల్పారామంలో చేనేత వస్త్రాల మేళా ప్రారంభం



శిల్పారామంలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న విశ్వనాథరెడ్డి తదితరులు

**పీఎం పాలెం:** చేనేత కళాకారులను ప్రోత్సహించి, వారి ఆర్థికాభివృద్ధికి సహకారం అందించాలని శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి కోరారు. చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేళాలో సుమారు 50 స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరు పొందిన చేనేత ఉత్పత్తులు ఈ స్టాల్స్‌లో లభిస్తాయని తెలిపారు. స్టాల్స్ నిర్వాహకుడు బి.సురేష్ మాట్లాడుతూ తక్కువ లాభాలతో చేనేత వస్త్రాలు విక్రయిస్తున్నామన్నారు. నాణ్యమైన జంబుఖానాలు, కార్పెట్లు, అన్నిరకాల చేనేత వస్త్రాలు ప్రదర్శనలో ఉంచామని తెలిపారు.

# జాతర పోస్టర్ ఆవిష్కరణ



నీలమ్మ వేపచెట్టు అమ్మవారి జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ విజయలక్ష్మి తదితరులు

**అల్లిపురం:** అస్సాం గార్డెన్స్, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి మహా శివరాత్రి వార్షిక జాతర మహోత్సవాల పోస్టర్‌ను ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గురువారం ఆవిష్కరించారు. ఆలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విజయలక్ష్మి మాట్లాడుతూ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం శుక్రవారం సాయంత్రం జరుగుతుందన్నారు. అమ్మవారి తిరువీధి ఉత్సవం అనంతరం అమ్మవారి మాలధారులు అగ్నిగుండ ప్రవేశం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు కె.లక్ష్మీకాంతం, కన్నూరు గంగ, భీమరశెట్టి చంద్రకళ, ఆలయ సిబ్బంది నరసమ్మ, కొడమంచలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాలమ్మకు విశేష పూజలు



విద్యుత్ దీపాలంకరణతో దుర్గాలమ్మ ఆలయం

**దాబాగార్డెన్స్:** పూర్ణామార్కెట్‌లోని వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాలమ్మకు విశేష పూజలు, ప్రత్యేక అర్చనలు జరిపారు. సాయంత్రం ఆలయం ప్రాంగణంలో శివలింగం ఆకారంలో దీపాలంకరణ చేపట్టారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు బత్తి మంగరాజు, కండిపల్లి వరలక్ష్మి, కాండ్రేగుల రూపావతి, రమణమ్మ, దశమంతుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**నేడు తొలేళ్ల ఉత్సవం..**



శివలింగం ఆకారంలో దీపాలంకరణ

జాతరలో భాగంగా శుక్రవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. 18న మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, ఆ రోజు అర్ధ రాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజ అత్యంత వైభవంగా జరపనున్నారు. 19న అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. 26న మారువారాన్ని పురస్కరించుకుని అష్టోత్తర శత పదార్థ నివేదన (108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నారు) ఉంటుందని తెలిపారు.

# సక్రమంగా చెత్త సేకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎల్ఎస్ శాస్త్రి

**జగదాంబ :** చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎల్ఎస్ శాస్త్రి అన్నారు. గురువారం సూర్యాబాగ్ జోన్-4 కార్యాలయంలో పారిశుద్ధ్యం సిబ్బంది, సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణలో తడి, పొడి ప్రమాదకర చెత్తను వేరు చేసి తీసుకోవాలన్నారు. క్లాప్ వాహనాలు కచ్చితంగా ఇంటింటికీ వెళ్లాలన్నారు. వాహనాలు వెళ్లలేని ప్రాంతాల్లో ఇళ్ల సమీపంలో వాహనాలు నిలిపి పారిశుద్ధ్య సిబ్బంది చెత్త సేకరించాలన్నారు. అదే విధంగా యూజర్ చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. సెక్రటరీల పర్యవేక్షణ తప్పనిసరి అని తెలిపారు. రికార్డులు నమోదు చేసుకోవాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, ఏఎంహెచ్‌వో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# సినిమా షూటింగ్ సందడి

**గోపాలపట్నం రైతుబజార్‌లో పరిచయ సన్నివేశాల చిత్రీకరణ**



గోపాలపట్నం రైతుబజార్‌లో హీరోయిన్ అయేషాపై సన్నివేశం చిత్రీకరిస్తున్న దృశ్యం

**గోపాలపట్నం:** గోపాలపట్నం రైతుబజార్‌లో గురువారం సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. ఉదయం 8.30 గంటలకు మొదలైన షూటింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. హీరోగా సీనియర్ నటుడు బ్రహ్మాజీ కొడుకు సంజయ్ రావు(ఓ పిట్ట కథ ఫేమ్), హీరోయిన్‌గా ముంబైకి చెందిన అయేషాల మధ్య పరిచయ సన్నివేశాలను చిత్రీకరించారు. రైతుబజార్‌లో హీరోయిన్ కూరగాయలు కొనడం.. హీరో కోసం వెతుకుతుండటం వంటి సన్నివేశాలను షూట్ చేశారు. ఈ షూటింగ్‌ను చూసేందుకు వినియోగదారులు, రైతులు ఎగబడ్డారు. కొంత మంది బజారు చేయకుండా ఖాళీ సంచులతో అక్కడే నిలబడి ఆసక్తిగా తిలకించారు. డాన్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ బ్యానర్‌పై నిర్మాత లివింగ్‌స్టన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు మణిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు.

# అనాథలను ఆదుకోవాలి



అనాథ పిల్లలకు బహుమతులు అందజేస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

**అల్లిపురం:** అనాథలను ఆదుకోవడంలో ముందుండాలని ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. సోషల్ మీడియా ఇన్‌చార్జి జల్లి రాజశేఖర్ కుమారుడు జల్లియాస్ విరాజ్ జన్మదినం సందర్భంగా గురువారం రాత్రి అల్లిపురం, సౌత్‌జైలురోడ్డులో గల డాన్‌బాస్కో నవ జీవన్ అనాథాశ్రమంలో ఫాదర్ బాలసౌర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న పిల్లలకు ఏర్పాటు చేసిన భోజనాన్ని ఆయన వారికి వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, కళింగ వైశ్య స్టేట్ డైరెక్టర్ సనపల రవీంద్ర భరత్, రాష్ట్ర యూత్ విభాగం కార్యదర్శి మాదాబత్తుల రమేష్, బెవరా మహేష్ తదితరులు పాల్గొన్నారు.



### మెగా పాటల పోటీలు రేపు

**సీతంపేట:** చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల18న పౌర గ్రంథాలయంలో మెగా పాటల పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గెంబలి జగదీష్, నూకల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని, పాల్గొనదలచిన వారు 92479 48184 నంబర్‌లో సంప్రదించాలన్నారు.